క్లుప్తంగా

అందుబాటులోకి ఏటీఎం సేవలు



ఏటీఎంను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

కవిటి: మండలంలోని రాజపురం యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు ఎప్పటినుంచో ఊరిస్తున్న ఏటీఎం సెంటర్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమని రీజినల్ హెడ్ఆఫీస్ మేనేజర్ వెంకటతిలక్, బ్రాంచ్ మేనేజర్ లాల్బెండ్ మిశ్రా అన్నారు. సోమవారం ఈ మేరకు యూనియన్ బ్యాంక్ ఆవరణలో వినియోగదారుల సౌకర్యార్థం ఏటీఎం కేంద్రాన్ని వారు ప్రారంభించారు. రాజపురంలో సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఆంధ్రాబ్యాంక్ ఏర్పాటైంది. తర్వాత ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్‌గా మారింది. తాజాగా ప్రారంభించిన ఏటీఎం సేవలతో 25 గ్రామాలకు చెందిన ఖాతాదారులకు మేలు జరుగుతుందని బ్యాంక్‌శాఖ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో స్థానిక గ్రామపెద్దలు, ఖాతాదారులు బుడంకాయల వెంకటరావు, సనపల రామారావు ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: టెక్కలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోర్టు వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్(ఘన వర్థ్యాల నిర్వాహణ)పై కార్మికుల్లో అవగాహన కల్పించేందుకు జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి మల్ల నేతృత్వంలో ఉదయం 9.15 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు గ్రామదేవత చల్లదనం ఉత్సవం

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి చల్లదనం ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిసేవలో తరించాలని ఆయన కోరారు. కవిటి పట్టణానికి చెందిన రైతులు, ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాల ఆధ్వర్యంలో చల్లదనం కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవం



అమ్మవారికి ముర్రాటలు తీసుకెళ్తున్న మహిళలు

టెక్కలి రూరల్: మండలంలోని కిట్టాలపాడు గ్రామంలో పాలపోలమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. రెండో రోజైన సోమవారం మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు.

మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లు భర్తీకి నోటిఫికేషన్

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి ఈ నెల 19వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో ప్రవేశానికి కూడా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేయాలన్నారు.

పూరీలో అలరించిన నృత్యకారులు



కళాశ్రీ అవార్డులతో ఇచ్ఛాపురం నృత్యకళాకారులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన నాట్యకారులు పూరీలోని జగన్నాథుని నృత్యోత్సవంలో అలరించారు. భారత్ ఆర్ట్స్ అకాడమి ప్రతినిధి లలితారావు ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరి ప్రదర్శన అలరించింది. నృత్యోత్సవంలో 1500 నృత్యకారులు పాల్గొన్నారని వెంకటేశ్వర అకాడమి అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. స్థానిక నృత్యకారులను నీలాచల్ సమ్మాన్ భారతీయ కళాశ్రీ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ సంగీత్ నాటక అకాడమి అధ్యక్షుడు నిరంజన్, ఒడిశా నాట్య గురువు విక్రమ్ సామల్, డైరెక్టర్ విజయ్ కుమార్ సాహు, కళాకారులు భీమ్సేన్, అశోక్ కుమార్ ఉన్నారు.

నవధాన్యాల సాగుతో.. భూమి సారవంతం



కవిటి: నవధాన్యాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఏపీఎం గోవింద్

కవిటి: నవధాన్యాలసాగుతో భూమితో పాటు రైతులకు ప్రయోజనకరమని మండల మహిళా సమాఖ్య ఏపీఎం కె.గోవింద్ అన్నారు. మండలంలోని జమేదారిపుట్టుగ గ్రామంలో పీఎండీసీ పథకంలో భాగంగా నవధాన్యాల సాగుతో నేల తల్లి బాగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నవధాన్యాల సాగుతో చేకూరే లాభాలను సంబంధితశాఖకు చెందిన సిబ్బంది వివరించారు. మహిళా సమాఖ్య, ఏపీసీఎన్ఎఫ్‌ల భాగస్వామ్యంతో 175 కిట్లను తయారు చేయించారు. అనంతరం నవధాన్యాలు సాగుతో భూమిలో కలిగే మార్పులు రైతులకు తెలియజేశారు. నవధానాయ్లతో అనేకలాభాలు ఉన్నాయని గొర్లెపాడు యూనిట్ ఇన్‌చార్జి తులసయ్య అన్నారు. 12 కిలోల నవధాన్యాలు 750 రూపాయలకే లభిస్తున్నాయని చెప్పారు. ఒక ఎకరానికి వెయ్యి రూపాయలలోపే ఖర్చవుతోందన్నారు. తొలకరి జల్లులు పడే సమయంలో వీటిని వేసుకోవడం ద్వారా యూరియా, డీఏపీ వాడకుండానే భూసారం పెరుగుతోందన్నారు. భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు సక్రమంగా అందుతాయన్నారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు భీమారావు రౌతో, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



కంచిలి: కూరగాయల్ని కొనుగోలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా ఉత్పత్తి చేసిన కూరగాయలు తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రతీ సోమవారం మాదిరిగానే ఈ వారం కూడా విక్రయ కేంద్రాన్ని నిర్వహించారు. ఇక్కడకు మండలంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్‌లో పండించినటువంటి కూరగాయలు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ స్టాల్‌లో కూరగాయల ఉత్పత్తులు ప్రతీవారం తీసుకెళ్తున్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎస్. కామరాజు, పుష్ప, మీనా, భవానీ, రోహిణి ఉన్నారు.



సోంపేట: మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయసిబ్బంది

ఆరోగ్యానికి మేలు ..

సోంపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయని ఏపీఎం రమణమ్మ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్యలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రకృతి పద్ధతులతో పండించిన కూరగాయలను మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద విక్రయించారు. మండల యాంకర్ కుమారి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో సాగు చేయడంతో ఎక్కువ దిగుబడి రావడమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ రాణి, ఐసీఆర్పీలు కృష్ణవేణి, శ్రావణి, జయలక్ష్మి, స్వాతి, మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనలు



అశోక్‌ను అభినందిస్తున్న బాలకృష్ణ



శిరీషాకు పూలగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ భీమారావు

కాశీబుగ్గ: ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడవసారి ఎన్నికైన బెందాళం అశోక్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ తదితరులు ఇచ్ఛాపురంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. టీడీపీ, బీజేపీ నాయకులు పలువురు ఉన్నారు.

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శిరీషాను పలువురు వైద్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన డాక్టర్ దంతం భీమారావు, వజ్రపుకొత్తూరు మండలం పూండికి చెందిన డాక్టర్ లీలా, డాక్టర్ కోదండరావులు దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. జూనియర్ వైద్యులు, నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, మీల జోగారావు ఉన్నారు. అలాగే ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పలాస మండలం శాఖ సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన శిరీషాను అభినందిస్తూ తీర్మానం చేశారు. సంఘ అధ్యక్షులు తమ్మినాన మాధరావు, సంఘం సెక్రటరీ నెమలిపురం అప్పారావు, సంఘ కార్యవర్గ సభ్యులు హనుమంతు ఎండుదొర, టీవై రెడ్డి, డాక్టర్ కుమార్‌నాయక్, సుడియా సత్యనారాయణ, ఫాల్గుణ నాయుడు, బమ్మిడి నాగేశ్వరరావు, వీరఘట్టం వెంకటరావు, కె.కొండలరావు ఉన్నారు.

ఉత్సవ సందడి



నల్లబొడ్లూరులో వేషధారణలతో సందడి చేస్తున్న యువత



ఖైజోలలో లవకుశ వేషధారణలో కళాకారుడు

కాశీబుగ్గ: మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలో సోమవారం సండేశ్వరి అమ్మవారి సిరుమానోత్సవం ఘనంగా జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వలసకార్మికులు, ఉద్యోగులంతా గ్రామానికి చేరుకుని వివిధ రకాల వేషధారణతో ఆకట్టుకున్నారు. అలాగే పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రామాయణం, మహాభారతంలోని పాత్రలను కళాకారులు వేషధారణలతో గ్రామంలో తిరుగుతూ సందడి చేశారు.

జానపద కళల్ని పరిరక్షించాలి

- ఎంపీపీ బోర పుష్ప



కోలాటం నృత్య మహిళలతో ఎంపీపీ బోర పుష్ప, గ్రామస్తులు



కోలాట ప్రదర్శనలో మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: అంతరించి పోతున్న జానపద కళల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ కళాకారునిపై ఉందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన పాతిక మంది మహిళలు కోలాటాన్ని నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో కళను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. జానపద కళలు శ్రీకాకుళం జిల్లా సొంతమన్నారు. అటువంటి కళను నేర్చుకునేందుకు మహిళలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. నాట్య గురువు తిప్పన ధనుంజయరెడ్డి దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, ఒడిశా చీకటి చైర్మన్ కాతిల నరసింహమూర్తి, రంగాల జానకీరామ్, దక్కత రామారావు, కుమార స్వామి, కళాకారులు గొనప లక్ష్మణమూర్తి, చలపరాయి వినోద్, రవికుమార్, లక్ష్మీనారాయణ, లోపింటి శంకర్, గంధపు సోమేశ్, గేదెల పరుశురామ్, దుర్గాశి మీన పాల్గొన్నారు.



కోలాటం నాట్య గురువు ధనుంజయరెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నీలకంఠేశ్వర స్వామికి బిల్వార్చన



పూజలందుకున్న స్వామివారు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరం పరిసరాల్లో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి బిలార్చనతో పాటు పుష్పార్చన, పాలాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

కవిటి: మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పాఠశాలల్లో పనులపై ఆడిటింగ్

టెక్కలి: పాఠశాలల్లో 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన వివిధ రకాల ఏడబ్ల్యూపీ పనులపై సోమవారం టెక్కలిలో ఆడిటింగ్ నిర్వహించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో సర్వశిక్షా ఆధ్వర్యంలో సుమారు 30 పాఠశాలల్లో 67,16,157 రూపాయల అంచనా వ్యయంతో జరిగిన వివిధ రకాల పనులపై ఆడిటింగ్ చేపట్టారు. టెక్కలి మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు సమక్షంలో పీబీ అసోషియేట్ సంస్థకు చెందిన ఆడిటర్లు ఆడిటింగ్ చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించి గత ఏడాది కొంత మేరకు బిల్లులు చెల్లించినట్లు పేర్కొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి హైస్కూల్‌లో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. ప్రస్తుతం వేర్వేరు వృత్తుల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. సహచరులు ఏవరైనా కష్టసుఖాల్లో ఉంటే అండగా నిలవాలని నిర్ణయించారు. చదువు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు.

అపూర్వ కలయిక



కాశీబుగ్గ: మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న పలాస హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల వేదికగా సోమవారం కలుసుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు 33 అనంతరం కలుసుకున్న వీరంతా రోజంతా సంతోషంతో గడిపారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. చదువు చెప్పిన గురువులను సత్కరించి గౌరవించారు. మరణించిన స్నేహితులను గుర్తు చేసుకొని నివాళులర్పించారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేశారు. ఆటపాటలో అలరించారు.

డొంకూరులో జ్వరాలు

ఇచ్ఛాపురం రూరల్: వారం రోజుల నుంచి డొంకూరు తీర ప్రాంతంలోని ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో వైద్య సిబ్బంది వైద్య సహాయక చర్యలు చేపట్టకపోవడంతో బాధితులు ఒడిశా, ఇచ్ఛాపురం, కవిటి వంటి ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మూడు రోజుల కిందట పుక్కళ్ల గురమ్మ అనే మహిళా తీవ్ర జ్వరంతో బస్సులో ఇచ్ఛాపురం ఆస్పత్రికి వెళ్తుండగా, మధ్య దారిలోనే అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. బుడ్డ నవీన్ అనే ఆరు నెలల పసివాడు తీవ్ర జ్వరంతో బాధపడితే ఆస్పత్రిలో చేర్పించామని, సుమారు పాతిక వేల వరకు ఖర్చయిందని నాన్నమ్మ నీలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతూ ఇచ్ఛాపురం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈదుపురం నూతన ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటే బాగుంటుందని తెలిపారు.

భక్తులకు అన్నదానం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ:

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మకోనేరు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు సోమవారం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మున్సిపాలిటీలోని బాలకృష్ణ అభిమాన సంఘం వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘ కార్యవర్గ సభ్యులు తాళ్లభద్ర బాబూరావు, గొలుసు వాసుదేవరావు, వసంతరెడ్డి, బోనెల శివ, మద్దిల రాజు, రొక్కం సోమేష్, రట్టి మనోజ్, జీవన్, బంపల్లి అప్పారావు, నందమూరి ఉన్నారు.

మూగజీవాలు విల విల!



గుంతలో ఉన్న నీటిని తాగేందుకు ఎగబడుతున్న గొర్రెలు

వజ్రపుకొత్తూరు రూరల్: మృగశిర కార్తె వచ్చినప్పటికీ ఎండ తీవ్రత తగ్గలేదు. దీంతో మనుషులతో పాటు మూగ జీవాలు విలవిల్లాడుతున్నాయి. సోమవారం సూర్యుడు భగభగ మండిపోయాడు. దీంతో ఎండతాపానికి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు నీడ కోసం చెట్ల కిందకు చేరాయి. అలాగే దాహార్తిని తీర్చుకోవడానికి చెరువులు, గుంతలలో ఉన్న నీటిని తాగుతూ ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందాయి.



చెట్టు నీడనుఅశ్రయించిన ఆవులు

కాశీబుగ్గలో వరుస చోరీలు



కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో జంటపట్టణాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లోని రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. కె.ఉమాపతి అనే ఆర్మీ ఉద్యోగి ఇంటిలో ఆయన భార్య లోకేశ్వరి లేకపోవడం చూసి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు విరగ్గొట్టి బీరువాలోని రెండు తులాల బంగారం ఆభరణాలు దొంగిలించారు. వారి పక్కనే ఉన్న భాస్కరరావు అనే ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలకు జొరబడి చోరీకి ప్రయత్నించారు. జరిగిన సంఘటనపై సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నెలరోజుల కిందట యాభైలక్షల విలువైన బంగారం దొంగతనం సైతం జవాన్ ఇంటిలోనే జరగడం తెలిసిందే.